నేడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం జరుగుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బెలగాం చర్చివీధి డివిఎం పాఠశాలలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన మోడల్స్‌ను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

కంటితుడుపు జీవోలతో కడుపునిండదు

- 11రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె
- పలుచోట్ల రాస్తారోకోలు, కోలాటాలతో నిరసనలు

పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

సీతంపేటలో ప్రధాన రహదారిపై బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జీతాల పెంపుదల కోసం అంగన్‌వాడీలో 11రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే పదవీ విరమణ వయసు, పరిహారం పెంపు వంటి కంటి తుడుపు జీవోలతో ప్రభుత్వం సమ్మెను పక్కతోవ పట్టించాలని చూస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధి సమ్మెలో భాగంగా శుక్రవారం పార్వతీపురం ప్రాజెక్ట్ నాయకులు అలివేలు, గౌరీ మణి ఆధ్వర్యంలో బెలగాం చర్చి కూడలిలో రాస్తారోకో చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ వెంటనే యూనియన్లను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాల, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు నాయకులు రాజేశ్వరి, ధర్మవతి నేలవేణి, బి.లక్ష్మి, కృష్ణవేణి, రాజేశ్వరి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. తక్షణమే అంగన్వాడీ సమస్యల పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 26నుంచి ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణరావు, మండల కార్యదర్శి రాము, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, పాలకొండ ప్రాజెక్టు అధ్యక్షులు జి.జెస్సీబాయ్, బి.అచ్చమ్మ, బి.జ్యోతి, కె.సీతమ్మ, ఎన్.ప్రమీల, కె.పావని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె 11రోజుకి చేరింది. ఈ మేరకు స్థానిక బోసుబొమ్మ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. డిమాండ్లు ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ నాయకులు బి.రాధ, శ్యామల వరలక్ష్మి, మండల నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ, తిరుపతమ్మ, పార్వతి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్ పేట కూడలి వద్ద అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ భద్రగిరి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ట్రెజరర్ మండంగి రమణ ఉన్నారు.

గరుగుబిల్లి: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు గౌరమ్మ, మర్రాపు సావిత్రి ఆధ్వర్యాన అంగన్‌వాడీలు గరుగుబిల్లిలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలకు పాల్పడి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించినా వెనక్కి తగ్గేదేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు,హెల్పర్లు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాస్తా రోకో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి, సిఐటియు నాయకులు టి.ప్రభావతి, కోరాడ ఈశ్వరరావు, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు

కురుపాం : అంగన్వాడీలు చేపట్టే నిరవధిక సమ్మె 11వ రోజుకి చేరుకున్నప్పటికీ ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేకపోవడం దీక్షా శిబిరం నుంచి సిఐటియు జిల్లా నాయకులు కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో వందలాదిమంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో భారీ ర్యాలీగా నిరసనలు నినాదాలతో బస్టాండ్ వరకు వెళ్లి మానవహారం నిర్వహించారు. ఇది కేవలం శాంతియుతంగా నిరసన మాత్రమేనని, ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి సమస్యను పరిష్కరించాలని లేదంటే భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని నాయకులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానిక ఎస్ఐ వి.షణ్ముఖరావు మానవహారం దగ్గరికి వచ్చి మానవహారం నిరసన విరమించమని అంగన్‌వాడీలను కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సీతారాం, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ నాయకులు, అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతానగరం: అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోలాటాలు, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. అనంతరం స్థానిక హనుమాన్ జంక్షన్‌లో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్.రాము, యూనియన్ నాయకులు సత్యవతి, సునీత, యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ప్రభుత్వ తీరుకు నిరసనగా అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళననుద్దేశించి సిఐటియు నాయకులు ఎం.కాంతారావు మాట్లాడుతూ తక్షణమే సిఎం స్పందించి అంగన్వాడీ సమస్యల పరిష్కారం చేయాలని, లేకుంటే ఈనెల 26 నుంచి ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎ.పార్వతి, ఎ.దర్శన్, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.సురేష్, గిరిజన సంఘం సీనియర్ నాయకులు పి.సాంబయ్య తదితరులు నాయకత్వం వహించారు.

బలిజిపేట: స్థానిక బస్టాండ్ వద్ద అంగన్వాడీలు కోలాటంతో నృత్యం ప్రదర్శించారు అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ అంగన్వాడీలు సమస్యలపై రోడ్డున పడేయడం సిగ్గు చేయటన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెలో భాగంగా అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో అనంతరం కొమరాడ మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తూ ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావుకు, ఎంఇఒ జె.నారాయణస్వామికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, అరుకు పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.సింహాచలం, భవన కార్మిక సంఘం నాయకులు యమక గౌర్నాయుడు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు బి.అలివేలు, జ్యోతి, మల్లేశ్వరమ్మ, పద్మ, లలిత, మాధవి, జయమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

సీతానగరంలో కోలాటం ఆడుతున్న అంగన్‌వాడీలు

బలిజిపేటలో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

46,884 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలో 198 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 8029 మంది రైతుల నుంచి 46,884 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికీ 46,884 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన గురికావాల్సిన అవసరం లేదని, దళారుల చేతిలో మోసపోవద్దన్నారు. తుపాను కారణంగా పంట నష్టాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈనెల 26 నుండి జిల్లావ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర ప్రారంభం అవుతుందన్నారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో ఐదు రకాల క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

పిఎం జన్‌మాన్ వివరాలు తాజా పర్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం జన్‌మాన్ (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కింద పివిటిజిలకు వివిధ పథకాల మంజూరుకు వివరాలను తాజా పరచాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. పిఎం జన్‌మాన్‌పై సంబంధిత అధికారులతో ఐటిడిఎ కార్యాలయంలో శుక్రవారం ప్రాజెక్టు అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్‌మాన్ కింద పివిటిజిలకు శత శాతం గృహాలు మంజూరు చేయాలన్నారు. పిఎం జన్ మాన్ కార్యక్రమం గూర్చి ఎంపిడిఒల వద్ద వివరాలు ఉన్నాయని, వాటిని సంబంధిత అధికారులంతా వెంటనే పరిశీలించి అవసరమగు చేర్పులు, మార్పులు చేయాలని అన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన సమాచారాన్ని శాఖాధికారులు ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, జిల్లా పంచాయతీరాజ్ డిఇ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిడి కె.శ్రీనివాసరావు, టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి కాగానే టిడ్కో గృహాలు అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

టిడ్కో గృహాల పనులు పూర్తికాగానే లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని ఎపి టిడ్కో కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.జ్యోతి శుక్రవారం ఒక ప్రకటన విడుదల పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో జి+3 పద్ధతిన 768 గృహాలను ఎపి టిడ్కో రూ.39.60 కోట్లు, మౌళిక సదుపాయాలకు రూ.8.98 కోట్లు మంజూరు మంజూరు చేసిందని తెలిపారు. 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మౌలిక సదుపాయాలైన రహదారులు, మురుగు నీటి కాలువలు పనులు జరుగుతున్నాయని, మురుగు నీటి శుద్ధి కేంద్రం పనులు 70 శాతం పూర్తయినట్టు అయ్యిందని ఆమె వివరించారు. నీటి సరఫరాకు రూ 5.28 కోట్లతో అంచనాలు వేసి పైఅధికారులకు పంపామన్నారు. విద్యుత్ సరఫరాకు రూ.3.08 కోట్లతో అంచనాలు వేసి అనుమతి రాగానే ఎపి ఇపిడిసిఎల్ ద్వారా పనులు మొదలు పెట్టటం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన (పిఎంఎవై)లో భాగంగా ఎపి టిడ్కో ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో ఎపి టిడ్కో గహ నిర్మాణ పనులును చేపట్టామన్నారు. ప్రభుత్వం 300 చదరపు అడుగుల గృహాన్ని ఒక్క రూపాయికి మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. 365 చదరపు అడుగుల గృహానికి ముందస్తుగా కట్టాల్సిన సొమ్మును రూ.50 వేలు నుంచి రూ.25 వేలుకు, 430 చదరపు అడుగుల గృహానికి లక్ష రూపాయల నుంచి రూ.50 వేలకు తగ్గించామని వివరించారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తాన్ని ప్రభుత్వ ఆదేశాలు జారీ మేరకు మున్సిపాలిటీ ద్వారా లబ్ధిదారుల వాటాలను వారికి అందజేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు, గృహాలు పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందచేసేందుకు సన్నాహాలు జరుతున్నాయని తెలిపారు.

మ్యూజియం పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో చేపడుతున్న గిరిజన మ్యూజియం పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఆదేశించారు. మ్యూజియంలో జరుగుతున్న పనులను పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మ్యూజియం పనులకు త్వరితగతిన నిధులను మంజూరు చేసి, పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టూరిజం ఆర్‌డి పి.శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, జాయింట్ మేనేజర్ హరేరామ్, ఇఇ సింహాచలం, ఎఇ మోహన్ గోపాల్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా లోపాలకు కూడా పరిహారం పొందొచ్చు

విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు వెంకట నాగసుందర్, డిఎస్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

వస్తువులు కొనుగోలులోనే కాకుండా సేవా లోపాలకు కూడా పరిహారం పొందవచ్చునని కన్స్యూమర్ కమిషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకట నాగసుందర్ తెలిపారు. ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల కమిషను ద్వారా పూర్తిగా ఉచిత సేవలు పొందవచ్చునని తెలిపారు. వస్తువులే కాకుండా ఆసుపత్రులు, రవాణాశాఖ, రైల్వే తదితర విభాగాల ద్వారా పొందిన సేవలు కూడా వినియోగదారుల ఫోరం పరిధిలోనికి వస్తాయన్నారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు, పొందిన సేవలకు బిల్లులు పొందాలని సూచించారు. బిల్లులను వారంటీ పీరియడ్ వరకు భద్రపర్చుకోవాలన్నారు. రెండేళ్లలోపు కేసువేయువచ్చునని, నోటీసు జారీచేసిన మూడు నెలల్లో కేసు పరిష్కారమవుతుందని తెలిపారు. రూ.50లక్షల వరకు క్లెయింలు పరిష్కరించేందుకు జిల్లా వినియోగదారుల కమిషన్‌కు అవకాశముంటుందని, ప్రతి వినియోగదారుడు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. తక్కువ ధర గల వస్తువులను ప్రకటనల ద్వారా ఎక్కువ ధరకు అమ్ముతారని, ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యత, బ్రాండ్ తేడాలు వస్తే సదరు సంస్థలు పరిష్కరించకపోతే సరఫరా సంస్థతో పాటు, తయారీ సంస్థను కూడా పార్టీగా చేర్చాల్సిఉంటుందని, కేసు వేసినపుడే పూర్తి అవగాహనతో కేసుపెట్టాలన్నారు. డిఎస్ఒ ఆర్.శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో గతనెల 22 నుంచి ఈనెల 8వరకు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు, పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమాజంలో ప్రతి వ్యక్తి వినియోగదారుడేనని, నాణ్యమైన, సరైన పరిమాణంలో సరసమైన ధరలకు వస్తువులు పొందే హక్కు వినియోగదారునికి ఉందన్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా జిల్లాలో రెండు లక్షల 80వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు 578 ఎఫ్‌పి షాపుల నుండి 196 మొబైల్ వ్యానుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 15 గ్యాస్ ఏజెన్సీలు, 37 పెట్రోలు బంకులున్నాయని వాటి ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన సేవలను వినియోగదారులకు అందించాల్సి ఉంటుందని అన్నారు. సేవా లోపాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 198 పాఠశాలల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కోసం క్లబ్‌లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. వినియోగదారుల హక్కుల గూర్చి, విజయాలు గూర్చిన సమాచారంతో పౌరసరఫరాల శాఖ ద్వారా మేలుకొలుపు మాసపత్రిక విడుదేయడం జరుగుతుందని, 300 రూపాయలు సంవత్సర చందాతో పుస్తకాన్నిపొందవచ్చునని, ప్రతి ఒక్కరు చందాదారులుగా చేరాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి ఆశా శేఖర్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు కె.రత్నరాజు, డెమో వి.సన్యాసినాయుడు, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పెంటపాటి సూర్యారావు, మహిళా వినియోగదారుల సంఘాల అధ్యక్షులు లావణ్యదీప్తి, వాణి, మన్యంరామకృష్ణ వినియోగదారులకు సంబంధించి శాఖలు, సంఘాల ద్వారా అందిస్తున్న సేవల గూర్చి, వినియోగదారుల హక్కుల గురించి వివరించారు.జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

దళారుల బారి నుండి రైతులను రక్షించాలి : సిపిఎం, టిడిపి డిమాండ్

డంగభద్రలో కొనుగోలు లేక నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను దళారీల బారి నుంచి రక్షించాలని సిపిఎం, టిడిపి నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలం డంగభద్రలో సిపిఎం, టిడిపి నాయకులు ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగనాయుడు మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఒకవైపు 80 కేజీలు బస్తా ధాన్యం రూ.1746కు కొంటామని చెబుతున్నప్పటికీ వాస్తవంగా రైతులకు మద్దతు ధర రావడంలేదన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న గోనె సంచులు, రవాణా ఛార్జీలు, కళాసీ కూలీ రైతులకు చేరడం లేదని,దళారీలే లాగేస్తున్నారని అన్నారు. ఆఖరుకు రైతులు దళారులకు 84 కేజీల ధాన్యాన్ని రూ.1500 నుంచి రూ.1600కు అమ్ముకుంటున్నారని అన్నారు. ఈ లెక్కన బస్తా ధాన్యం వద్ద రూ.250 వరకు రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎటువంటి షరతు ల్లేకుండా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని, రవాణా ఏర్పాట్లు అధికారులే బాధ్యత పడి రైతులకు ఇవ్వాలని, గోనె సంచులు ఇవ్వాలని, కళాసీ కూలీ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు కూడా దళారులకు ధాన్యం అమ్మకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో రైతులంతా కదిలి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం, డంగభద్ర సర్పంచ్ జోగి భుజంగ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

27 నుంచి కుష్టు నిర్ధారణ సర్వే

పార్వతీపురం రూరల్: 27 నుండి జనవరి 9వరకు కుష్టు వ్యాధి సర్వే నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాధరావు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్‌ను ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజుకు 50 ఇళ్లు చొప్పున ఎఎన్ఎం, ఆశా వర్కర్లు సర్వే చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఒ డి. శివకుమార్, జిల్లా లెప్రసీ అధికారి ఎ. శ్యామకుమార్ పాల్గొన్నారు.

మూడోరోజు కొనసాగిన ఎస్ఎస్ఎల సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 18 విభాగాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు రాష్ట్ర వ్యాపితంగా కొనసాగిస్తున్న సమ్మె పార్వతీపురం జిల్లా కేంద్రంలో మూడో రోజు విజయవంతంగా కొనసాగింది. వారి డిమాండ్లతో కూడిన టీ షర్టులను ధరించి స్థానిక ఆర్‌టిసి కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ, కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎ.పోలి నాయుడు, కె.భారతి, బివి రమణ, బి.ఈశ్వరరావు, నిరసన శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమం లో జెఎసి నాయకులు సిహెచ్ భానుప్రకాష్, ఎ.దివాకర్, జి.రమేష్, వై.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

తొలి ప్రయత్నంలోనే ఎస్ఐ ఉద్యోగం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని గోపాలపురానికి చెందిన సింగరాతి శకుంతల అనే యువతి తొలి ప్రయత్నంలోనే అకుంఠిత దీక్షతో ఎస్సై ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గురువారం ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఐ పోస్టుల ఫలితాల్లో తమ గ్రామానికి చెందిన శకుంతల ఎస్సై గా ఎంపిక కావడం తమకు ఎంతో గర్వకారణమని సర్పంచ్ పెంట చిన్నమ్ములు రమణ తెలిపారు. ఐదో తరగతి వరకు చొక్కాపువానివలస ఎంపీపీ పాఠశాలలోనూ, పదో తరగతి ఎంఆర్ నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, ఇంటర్, డిగ్రీ పార్వతీపురం భాస్కర్ కాలేజీలోని చదివిన ఈమె తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అభినందించదగ్గ విషయమని గ్రామస్తులు తెలిపారు.

ఐటిఐ విద్యార్థులకు సువర్ణావకాశం

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిఐలో రెండేళ్ల కోర్సులో చదివి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులకు పాలిటెక్నికల్ కోర్సులో నేరుగా రెండో సంవత్సరం ప్రవేశపరీక్ష ద్వారా వెసులుబాటును రాష్ట్రప్రభుత్వం కల్పించిందని ఐటిఐ ప్రిన్సిపల్ గోపాల్‌కృష్ణ ఒక ప్రకటన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 2నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9491 13 44 64 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రక్ షీట్లను వెంటనే క్లియర్ చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ధాన్యం కొనుగోలుపై అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ హేమలత

బియ్యం మిల్లులకు సరఫరా చేసిన ధాన్యం ట్రక్ షీట్లను వెంటనే క్లియర్ చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. మండలంలోని బూరద వెంకటా పురంలోని శ్రీ సంతోషిమాత మోడరన్ రైస్ మిల్లును శుక్రవారం ఆర్‌డిఒ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని ట్రక్ షీట్లను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. ట్రక్ షీట్లు మూసేసేందుకు వాహనం మిల్లుకు చేరుకోకపోవడం, బరువు సరిపోకపోవడం వంటి కొన్ని సమస్యలున్నాయని మిల్లు యజమాని తెలపగా, మిల్లుల వద్ద వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూడాలని, సమస్యలుంటే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కస్టోడియన్ అధికారులను ఆదేశించారు.

భీంపురం వద్ద రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

నెరవేరిన గిరిజనుల చిరకాల వాంఛ

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల ప్రజల చిరకాల వాంఛ అయిన భీంపురం వంతెన నిర్మాణం పూర్తయిందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని భీంపురం వద్ద రూ.80 లక్షలు ఇఇ నిధులతో నిర్మించిన రోడ్డును శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో వబ్బంగి, నీలకంఠాపురం, ఊసకొండ పంచాయతీల్లో గల సుమారు వంద గిరిజన గ్రామాలకు అటు సీతంపేట మీదగా శ్రీకాకుళం జిల్లాకు వెళ్లడానికి అటు నుంచి ప్రజలు ఇటు రావడానికి రహదారి మార్గం సులభమైందన్నారు. అకార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జె.శాంతీశ్వరరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్ ఎంపిపిలు బి.అన్నాజీరావు, రంగారావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, స్థానిక గ్రామస్తులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-పాలకొండ

చెక్కు బౌన్స్ కేసులో విశాఖకు చెందిన చిన్నవాడుకు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.3లక్షలు అపరాధ రుసుము విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విజయ రాజ్ కుమార్ తీర్పు ఇచ్చారు. పాలకొండ పట్టణానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు గతంలో కోర్ట్ ు ఆశ్రయించగా దానిపై విచారణ జరిపి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

ఎంపిడిఒ కార్యాలయంలో వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వార్షిక తనిఖీలను శుక్రవారం జెడ్పి సిఇఒ కె.రాజ్‌కుమార్ చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 34మండలాల్లో 15వ ఆర్థికసంఘం నిధులు రూ.8కోట్లు సిద్ధంగా ఉన్నాయని, వాటిని తక్షణమే ఖర్చు చేయాలని కోరారు. ఈనెల 26నుండి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ రికార్డుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఎం ఎల్ ఎన్ ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి గంట చంద్రమౌళి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెద్దగొత్తిలి పంచాయితీ నాగర కుంటుంబాయి గిరిజన గ్రామంలో వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజ పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు నట్టల నివారణ, చలికాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం 250 మేకలకు నట్టల నివారణ టీకాలు వేయించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది బి.శ్రీనివాసరావు, ఎం.నరేంద్రకుమార్, పాల్గొన్నారు.

ఏజెన్సీలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

స్థాని సచివాలయం-1 పరిధిలో గల వోబ, తురాయపువలస, సీతంపేట గ్రామాలో గడప గడపకు - మన ప్రభుత్వం శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన శుక్రవారం నిర్వమించారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలుకు అందజేస్తున్న పథకాలను గ్రామస్తుకలు వివరించారు. అలాగే ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక బి.ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ హిమరక మోహనరావు, జెడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, స్థానిక సర్పంచ్ ఆరిక కళావతి, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు.25వ వార్డులో ఇటీవల చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వార్డులో చేపట్టిన సీసీ కాలువలు, రోడ్లును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల వాలంటీర్ల ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన నూతన కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ ఎన్.సుధీర్‌కుమార్, ఆర్.చిన్నం నాయుడు, ఎఎంసి డైరెక్టర్ గండిలక్ష్మి, వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నవశకం స్ఫూర్తితో పని చేస్తాం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర విజయోత్సవ సభ నవశకం స్ఫూర్తితో మరింత ఉత్సాహంతో పనిచేసి టిడిపిని ప్రజల్లోకి తీసుకెళ్తామని పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. కనీవినీ రీతిలో మహాసభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి విచ్చేసి కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ప్రజలు వైసీపీని తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వారికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీ ప్రకటించిన బాబు గ్యారెంటీ పథకాలను తీసుకువెళ్లి ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎపి గ్రామీణ వికాస్ బ్యాంక్ భద్రగిరి శాఖ ద్వారా ఎస్‌బిఐ జనరల్ ప్రమాద బీమా రూ.20 లక్షల చెక్కును ఖాతాదారు పాలక లలిత భర్త వంశీకి బ్రాంచి మేనేజర్ జితేంద్ర కుమార్ అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారు పాలక లలిత ప్రమాదానికి గురై మరణించడంతో ఎస్బిఐ జనరల్ ప్రమాద బీమా సొమ్ము రూ. 20 లక్షలు చెక్కును వంశీకి అందించమన్నారు. ప్రమాద బీమా (ఇన్సూరెన్స్) ప్రతి ఒక్కరు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, అకౌంటెంట్ భాస్కరరావు, క్యాషియర్ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ జుత్తాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

7న నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవరి 7న యుటిఎఫ్ ఆధ్వర్యంలో నవోదయ మోడల్ టెస్ట్ పరీక్ష నిర్వహించనున్నట్లు మండల శాఖ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులు, పిల్లలను రాత పరీక్షకు పంపించాలని కోరారు. అవసరమైన వారు బి.వాసుదేవరావు, ఎస్.సతీష్ ఫోన్‌నెంబర్లు 8639618305, 8309840460కు సంప్రదించాలన్నారు.

పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్లమెంటులో భద్రత వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వంపై ఇండియా కూటమి పిలుపు మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ అప్రజాస్వామికంగా ఇండియా కూటమి సభ్యులను సస్పెండ్ చేశారని, దీన్ని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన విభాగం అధ్యక్షులు రాఘవేంద్రరావు, మండల అధ్యక్షులు మూటక లక్ష్మయ్య, బిసి విభాగం అధ్యక్షులు లాభాల గణేష్, నాగేశ్వరరావు , రైతు విభాగం అధ్యక్షులు ఫకీరు, పాపారావు ఉన్నారు.

దృష్టి సారిస్తే గణితం సులువు

- జాతీయ గణిత దినోత్సవంలో వక్తలు
- ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

విద్యార్థులకు బహుతులు అందజేస్తున్న అర్బన్‌బ్యాంకు అధ్యక్షులు ఈశ్వరరావు

ప్రజాశక్తి - సాలూరు

గణితంపై ఇష్టంతో దృష్టి సారిస్తే పట్టు సాధించడం సులువు అవుతుందని స్థానిక రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రంభ రజనీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి మాట్లాడుతూ గణితం కష్టమైన సబ్జెక్టు అనే భయాన్ని విద్యార్థులు వదిలివేయాలని కోరారు. అనంతరం గణిత ప్రతిభా పరీక్షలో విజేతలకు అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.మోహనరావు, డాక్టర్ వి.గణేశ్వరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం వంగపండు రాజేంద్ర ప్రసాద్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కెవి సత్యనారాయణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని తంపటాపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నేషనల్ మ్యాథమెటిక్స్ డే జరుపుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, మ్యాచ్ టీచర్లు కెఆర్‌ఎం జయరావు, ఎస్.రమేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో మేథ్స్‌డే ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో క్విజ్ పోటీలు, ఎస్సే రైటింగ్, డిబేట్ కాంపిటీషన్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్ జరిగింది. శ్రీనివాస రామానుజమ్ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలో స్టేట్ లెవెల్ మ్యాథ్స్ క్విజ్ పోటీలో స్కూల్ విద్యార్థులు ఆర్.సాయికిరణ్, బి.భవ్య, ఎ.దీపికలకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. వారికి నగదు బహుమతి రూ.6వేలు వచ్చింది. ఆ విద్యార్థులకు ప్రోత్సాహంగా ఇదే పాఠశాలలో పనిచేస్తున్న సూరు శ్రీనువాసరావు టీచర్ విద్యార్థుల ప్రతిభకు మెచ్చి ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి విద్యార్థులను అబినందించారు.

ఓనిలో....

ప్రపంచం గర్వించదగ్గ భారతీయ గణిత మేధావి, గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని, వోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని బలగ నాగమణి అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి నాగమణి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానుజన్ జీవితచరిత్రకు సంబంధించి వక్తత్వ, గణిత ప్రశ్నల క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : మానవాళి అభివృద్ధికి గణితం ఎంతో కీలకమైందని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు అన్నారు. శుక్రవారం భారత గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ 135 వ జయంతి సందర్భంగా పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, ప్రమీల, శ్రీనివాసరావు, సంతోష్ పండా, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని డోకిసీల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు గోవిందరావు ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవ నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 9, 10 తరగతి విద్యార్థులు పి రాణి, ఎస్ నవదీప్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సంరక్షకుడు రమేష్ పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో...

మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ సంఖ్య 1729 ఆకారాన్ని విద్యార్థులతో ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు అనేక ప్రాజెక్టు తయారుచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గౌరి గణిత ఉపాధ్యాయులు సూర్యనారాయణ, రామలింగస్వామి, లక్ష్మి, ఈశ్వరరావు, దావీదు, చంద్రకళ, జనార్ధనరావు మాట్లాడారు. అనంతరం బహుమతులను అందజేశారు.

బలిజిపేట : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా దేశానికి సేవలందించాలని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. మండలంలోని పలగర ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ కు ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పార్వతీపురం : 1729 నమూనాలో పెదబొండపల్లి విద్యార్థులు

కురుపాం : రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కొమరాడ

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తరగతి గదులను సందర్శించారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ గణిత దినోత్సవ సందర్భంగా విద్యార్థినిలతో కాసేపు ముచ్చటించారు. అధిక శాతం విద్యార్థినిలు గణితం సబ్జెక్టులో ఎక్కువగా భయపడే అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని అధిగమించేలా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కాసేపు ఉపాధ్యాయుల అవతారమెత్తి విద్యార్థినిలకు విద్యా బోధనలు అందించారు. విద్యార్థి వారీగా ఒక్కొక్కరికి ఏఏ సబ్జెక్టులో అవగాహన తక్కువగా ఉన్నదీ, వారికి ఏ విధమైన విద్యాబోధనలో అందించాలని ఉపాధ్యాయులు ప్రత్యేక అధికారితో చర్చించారు. అనంతరం విద్యార్థినిలకు ఇప్పటి వరకు చెప్పిన సిలబస్‌లోని కొన్ని ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతతో పాటు మంచి ఫలితాలు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. కాబట్టి సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకునేలా ఉపాధ్యాయులంతా కలిసి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అరుణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

సీతంపేట : విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి ఆదినారాయణ

మండలంలోని మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం నూతన విద్యా విధానం ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నాడు నేడు పేరుతో పాఠశాలలను బాగుచేసి విద్యార్థులకు సౌకర్యం కల్పించిందన్నారు. మండలంలోని తొమ్మిది పాఠశాలలకు 340 ట్యాబ్‌లను అందజేశారు, కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూర్యదేముడు, ఎం.వెంకటరమణ, ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరామ నాయుడు, జెడ్పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి మండల కన్వీనర్ బి.చిట్టిరాజు, సర్పంచ్ సాంబన్న దొర, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి ఆదినారాయణ ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబులను వినియోగించుకోవాలని కోరారు. వీటి ద్వారా విద్యార్థులు మంచి సబ్జెక్టు నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలపై వినతి

బలిజిపేట : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ అప్పలరాజుకు గ్రామ సేవకులు శుక్రవారం వినతిని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ విఆర్‌ఎలకు తెలంగాణా వలే పేస్కేల్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులను అర్హులైన విఆర్‌ఎలను నియమించాలని, 2018 జూన్ నుండి జీతంతో కూడిన డిఎ ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, రీ సర్వేలో విఆర్‌ఎల సొంత గ్రామాలకు మాత్రమే పనులు ఇవ్వాలని, అక్రమ డ్యూటీలు చేయించరాదని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో శ్రీనువాస్, బాబురావు, రామయ్య, మరియమ్మ, లక్ష్మణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమస్యలు సరిదిద్దండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో భూసర్వే సమస్యలను సరిదిద్దాలని పలువురు సభ్యులను రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి, జడ్పీవైస్ చైర్మన్ బాపూజీనాయుడు మాట్లాడుతూ సభ్యులు తెలియజేసిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో జరిగిన లోపాలను రెవెన్యూ అధికారులు సరిదిద్దాలన్నారు. పలుచోట్ల పంట పొలాలకు వెళ్లే రహదారులు ఆక్రమణలకు గురైనప్పటికీ రీసర్వేలో వాటిని సరిచేయకుండా ఇప్పుడు ఉన్న మేరకు సర్వేరాళ్లు ఏర్పాటు చేశారని ఇది ఎంతవరకు సమంజసమని రెవివెన్యూ అధికారులను ఎంపిపి ప్రశ్నించారు. ఈ విషయంపై డిప్యూటీ తహసిల్దార్ పెల్లూరి సత్యలక్ష్మి కుమార్ మాట్లాడుతూ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మిల్లర్లు రైతులను తప్పుతోవ పట్టిస్తున్నారు

ధాన్యం కొనుగోలుపై ప్రశ్నిస్తున్న సర్పంచ్

రైతుల నుంచి రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించిన అనంతరం మిల్లర్లు ధాన్యంలో తేమశాతం ఉందని ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాగూరు ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, వల్లరిగుడబ సర్పంచ్ రౌతు గోవిందనాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి మాట్లాడుతూ మిల్లర్లకు తగు సూచనలు సలహాలను అందజేశామన్నారు. అలాగే ఇతర జిల్లాలకు ధాన్యంను తరలించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. అనంతరం పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, పలుశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను నివారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మాతృ మరణాలను నివారించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో శుక్రవారం ప్రాజెక్టు అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రక్త హీనతపై దృష్టి సారించాలన్నారు. రక్త హీనత కారణంగా గర్భిణుల్లో అధిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయన్నారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, హైరిస్క్ గర్భిణుంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పౌష్టిక ఆహారం విధిగా అందాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ సరఫరా చేస్తున్న పౌష్టికాహారం కిట్లను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అత్యావశ్యకమన్నారు. గర్భిణులు రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలు ఉంటే ప్రసవ తేదీలను గుర్తించి అందుకు తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్త హీనత పరీక్షించాలన్నారు. సంక్రామిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథ రావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివకుమార్, జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గోపాల్

గుమ్మలక్ష్మీపురం : వైసిపి జిల్లా యువజన కార్యదర్శిగా ఎన్నికైన నిమ్మక గోపాల్ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనను యువజన కార్యదర్శిగా నియమించడంతో మరింత కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రెండవ వైస్ ఎంపిపి లక్ష్మణరావు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

బోల్తాపడిన బియ్యం లారీ

లోయలో లారీ బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్, క్లీనర్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఒడిస్సా ఆంధ్ర మూడో మైలు ఘాట్ రోడ్డు వద్ద శుక్రవారం వేకువజామున బియ్యం లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని బొరుగుమ నుండి బియ్యం బస్తాల లోడుతో విశాఖ పోర్టుకు వస్తుండగా శుక్రవారం వేకు జామున లారీ డ్రైవర్ అతివేగంతో నడపడంతో ఆంధ్ర ఒడిస్సా మూడో మైలురాయి వద్ద లారీ అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. ముందు జాగ్రత్తగా డ్రైవరు, క్లీనర్ లారీ నుండి దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు అయి బియ్యం బస్తాలు చెల్లా చెదురయ్యాయి. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ కృపారావు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గాయపడిన విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చిదిమి విఆర్‌ఒ వై.రాజారావు(51) తీవ్ర గాయాలు పాలై శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఎంవి రమణ తెలిపారు. మృతుడి భార్య వై.అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంకు చెందిన వెల్లంకి ప్రసాద్ అనే వ్యక్తి వారం రోజుల క్రితం రూ.24వేలు విలువ గల మొబైల్ సెల్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వి.షణ్ముఖరావు స్పందించి ఫిర్యాదుదారుడు అందించిన సమాచారం ప్రకారం మొబైల్ ట్రేస్ అవుట్ చేసి మొబైల్లో పట్టుకుని ఫిర్యాదుదారుడు ప్రసాద్‌కు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో అందించారు. ఈ సందర్భంగా ఆయనకు ఫిర్యాదుదారుడు స్థానిక గ్రామస్తులు కంప్లీట్ చేసిన వారం రోజుల్లో మొబైల్ ట్రేస్ అవుట్ చేసి అందించినందుకు ఎస్ఐకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల్లో యాదవుల సత్తా చాటాలి

ప్రజాశక్తి - సాలూరు

సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

రానున్న ఎన్నికల్లో యాదవులంతా ఐక్యతతో పని చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈ.శేఖర్ యాదవ్ అన్నారు. మండలంలోని పిఎన్ బొడ్డవలస ఉప్పల గార్డెన్స్‌లో యాదవ సంఘం వనభోజనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాజకీయాల్లో యాదవులకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని చెప్పారు. గుర్తింపు రావాలంటే రానున్న ఎన్నికల్లో యాదవులంతా ఐక్యతతో పని చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా యాదవుల సంక్షేమానికి పాలకులు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పారు. జీవనోపాధి మెరుగుపరచడానికి పథకాల అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో యాదవులు ప్రదర్శించిన తప్పెట గుళ్ళు, కోలాటం ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. గాజువాక వైసిపి ఇంఛార్జి వి.చందూ యాదవ్, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బి.కాంతారావు, యాదవ సంఘం నాయకులు ముచ్చి రామలింగయ్య, బమ్మిడి అప్పలస్వామి, బమ్మిడి అప్పలనాయుడు, మన్యాల కృష్ణ, నమ్మి అప్పలరాజు, గదుల సత్యవతి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరుపుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జున రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ జామి నారాయణస్వామితో కలిసి మండలంలోని అన్ని ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి గ్రామస్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గ్రామ స్థాయి మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో పలు సచివాలయ పరిధిలో క్రీడా మైదానాలు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆడుదాం క్రీడా కార్యక్రమాల్లో ఎటువంటి లాభాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పోటీలను నిర్వహిస్తుందని, కాబట్టి సిబ్బంది పూర్తి స్థాయిలో సహకారం అందిస్తారు కాబట్టి గ్రామస్థాయిలో సమర్థవంతంగా క్రీడలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించి క్రీడాకారులంతా ఆన్లైన్లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ స్కూల్ నుంచి వచ్చిన పిడి ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐటిడిఎ పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక ఐటిడిఎ పరిరక్షణకు పోరాటం చేస్తామని, అందులో భాగంగా ఈనెల 31న పార్వతీపురంలో జిల్లా గిరిజన సదస్సు నిర్వహిస్తున్నామని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు పి.రంజిత్ కుమార్, పి.శ్రీనునాయుడు, పి.సంగం, జె.ముత్యాలు, సిహెచ్.చందు తదితరులు అన్నారు. ఈ మేరకు గిరిజన సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటిడిఎ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ కోసం ఖర్చు చేయాల్సిన నిధులు దారిమళ్లుతున్నాయన్నారు. గిరిజన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోయ వాల్మీకులను గిరిజన తెగల జాబితాలోకి తేవాలని అసెంబ్లీలో తీర్మానం చేసి గిరిజనులకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏలను నిర్లక్ష్యం చేసిందని, పాలక వర్గ సమావేశాలు కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈనెల 31న జరిగే గిరిజన సదస్సులో గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.